క్లుప్తంగా

ఎమ్మెల్సీ సహకారంతో బోరు మోటారు ఏర్పాటు

కొందుర్గు: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సహకారంతో ముట్పూర్ ఉన్నత పాఠశాలలో బోరు వేయించినట్లు గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తెలిపారు. పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి నవీన్ కుమార్‌రెడ్డి హాజరయ్యారని, ఈ సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు ఆయన బోరు వేయించి, మోటార్ అమర్చి విద్యార్థులకు నీటికొరత లేకుండా చూస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆదివారం బోరు వేయించామన్నారు. త్వరలోనే మోటార్ అమర్చి నీటి సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకుడు ప్రభు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి, విద్యార్థులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఖర్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ముసురు వర్షం



అమ్డాపూర్‌లో కురుస్తున్న చిరుజల్లులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో గత మూడు రోజులుగా మబ్బులతో మేఘాకృతమై చిరుజల్లులు కురుస్తున్నాయి. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, చిన్నమంగళారం, నక్కలపల్లి, తోల్‌కట్ట, కనకమామిడి, ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడు కనిపించకపోగా కమ్ముకున్న మేఘాలతో చిరుజల్లులు కురుస్తుండడంతో రోడ్లు జలమయమవుతున్నాయి. దీంతో గ్రామాల్లోని ప్రజలు ఎటు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికసాయం

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన పిక్లీ అనే మహిళ ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ ఆదివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, మాజీ సర్పంచ్ రామునాయక్, తులసీరాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

ఇబ్రహీంపట్నం రూరల్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.భూపాల్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐటీయూ కన్వీనర్ తులసీగారి నర్సింహ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని కల్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ నాయకులు ఎం.భూపాల్, కేవీపీఎస్ అధ్యక్షుడు సైకిలాబ్ బాబు విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల పక్షాన నిలబడే సంఘం సీఐటీయూ మాత్రమేనన్నారు. పేదల హక్కుల సాధనే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తున్నట్లు వివరించారు. అధ్యక్షుడిగా అనిల్, కార్యదర్శిగా బాబు, ఉపాధ్యక్షుడిగా జగన్, కోశాధికారులుగా ఉపేందర్, సదానందం, సహాయ కార్యదర్శులుగా రమేశ్, కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సామేలు, సీపీఎం మండల కార్యదర్శులు చాతాళ్ల జంగయ్య, ఆలంపల్లి నర్సింహ, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కరిగెట్లు

- వరి సాగుకే రైతుల మొగ్గు
- గతేడాది కంటే పెరిగే అవకాశం
- ఆగస్టు 31వరకు నాట్లు వేసుకోవచ్చని అధికారుల సూచన



నక్కలపల్లిలో పోసిన వరినారు



నాగిరెడ్డిగూడలో కరిగెట్లు చేసిన పొలం

మొయినాబాద్: వరిసాగుకు రైతుల్లో ఆసక్తి పెరిగింది. వానాకాలంలో చాలా మంది రైతులు వరి సాగుపైనే దృష్టి పెట్టారు. వరినాట్లు వేసేందుకు రైతులు జోరుగా కరిగెట్లు చేస్తున్నారు. ప్రస్తుతం రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పాటు బోరుబావుల్లో నీళ్లు ఉండటంతో కరిగెట్లు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే చాలామంది రైతులు నార్లు పోయగా మరి కొంతమంది స్వల్పకాలిక రకాల నార్లను పోస్తున్నారు.

వరివైపే దృష్టి..

హైదరాబాద్ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలంలో చాలా మంది రైతులు పూలు, కూరగాయలతోపాటు వరిసాగు చేస్తారు. సాధారణంగా మండలంలో పూలు, కూరగాయల పంటలే ఎక్కువగా పండిస్తారు. అయితే గతేడాది నుంచి రైతులు పూలు, కూరగాయలతో పాటు వరి సాగుపైన దృష్టి పెట్టారు. వానాకాలంలో రైతులు జూన్ మొదటివారం నుంచే నార్లు పోసి కరిగెట్లు సిద్ధం చేస్తారు. ఈ సారి వర్షాలు కాస్త ఆలస్యం కావడంతో రైతులు నార్లు సైతం ఆలస్యంగానే పోస్తున్నారు. ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉండటంతో ఆలస్యంగా వర్షాలు పడ్డ వరిసాగు చేయాలని రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని చిలుకూరు, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి, ఎలుకగూడ, పెద్దమంగళారం, అప్పారెడ్డిగూడ, చిన్నషాపూర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, కనకమామిడి, వెంకటాపూర్, సురంగల్, శ్రీరాంనగర్, అమ్డాపూర్, బాకారం, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో జోరుగా కరిగెట్లు చేస్తున్నారు.

బియ్యం ధరలు పెరగడమూ కారణమే..

గతేడాది బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. గత వానాకాలంలో వరి పండించిన రైతులు బియ్యాన్ని రూ.5500–6500 వరకు విక్రయించారు. అంతకుముందు వరకు బియ్యం ధరలు రూ.3000–3500 వరకు మాత్రమే ఉన్నాయి. బియ్యం ధరలు పెరగడంతో రైతులు వరిసాగును పెంచుతున్నారు.

గతేడాది మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. అయితే ఈ సారి అంతకంటే ఎక్కువగానే సాగయ్యే అవకాశం కనిపిస్తోంది. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 3,889 ఎకరాలు కాగా ఈ సారి సుమారు 7 వేల ఎకరాల్లో వరి సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

వరిసాగే లాభసాటిగా ఉంది



భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో నీళ్లు ఉండటంతో వరి పంట సాగు చేయడమే లాభసాటిగా ఉంది. గతేడాది నుంచి ధాన్యం, బియ్యం ధరలు పెరిగాయి. గతేడాది బియ్యం ధర క్వింటాలు రూ.5000 పైగా అమ్మింది. ఈసారి కూడా వరి సాగు చేస్తున్నాను.

– జొన్నాడ రాజు, రైతు, చిలుకూరు

ఆగస్టు 31 వరకు నాట్లు వేసుకోవచ్చు



వానాకాలంలో జూన్ మొదటి వారం నుంచే రైతులు వరినార్లు పోస్తారు. అయితే ఈ సారి ఇప్పటివరకు వర్షాలు కాస్త తక్కువగానే కురిశాయి. ఇప్పటినుంచి వర్షాలు సంమృద్ధిగా కురిస్తే ఆగస్టు 31 వరకు నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంది.

– రాగమ్మ, మండల వ్యవసాయాధికారి

వైభవంగా బోనాల ఉత్సవాలు

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. డప్పు, డోలు వాయిద్యాలతో బోనాలను ఊరేగించారు. మొదటగా గ్రామ నడిబొడ్డులోని హనుమాన్ దేవాలయం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. గ్రామస్తులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, ఒగ్గు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ: బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

పోచమ్మ బోనాలు

శంకర్‌పల్లి: పౌర్ణమి సందర్భంగా పట్టణంలో బోనాల వేడుకలను ప్రారంభించారు. ఆదివారం 14వ వార్డులో కౌన్సిలర్ శ్వేతపాండురంగారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి బోనాలు చేసి స్థానిక పోచమ్మ దేవాలయంలో సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ప్రజలపై ఆ తల్లి చల్లని దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు.



శంకర్‌పల్లి: బోనాలతో కౌన్సిలర్ శ్వేత, కుటుంబసభ్యులు



చేవెళ్ల: బోనాలతో మహిళలు

ఆలూరులో..

చేవెళ్ల: మండలంలోని ఆలూరు గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామ నాయకులు బోనాల ఉత్సవాల కోసం ప్రత్యేకంగా హన్మకొండ నుంచి రాములు బృందం పోతురాజులను, బోనాల కళాకారులను పిలిపించి ఉత్సవాలను వేడుకగా జరిపించారు. బోనాల ఊరేగింపులో పోతురాజులు, కళాకారుల ఆటాపాటలు అందరినీ అలరించాయి. భక్తి శ్రద్ధలతో ప్రజలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

రోడ్డుపై గొయ్యి



కల్వర్టుపైన ఏర్పడిన గోతి

కేశంపేట: అమనగల్లు నుంచి కేశంపేటకు వచ్చే రోడ్డులో ఉన్న కల్వర్టుపైన గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కేశంపేట నుంచి అమనగల్లు వరకు సంవత్సరం క్రితమే రోడ్డును నిర్మించారు. గోతి ఏర్పడిన ప్రదేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. సంవత్సర కాలంలోనే కల్వర్టుపై గోతి ఏర్పడటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ రోడ్డును నాసిరకంగా నిర్మించడంతోనే కల్వర్టుపై గోతి ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నాణ్యతను పునఃపరిశీలన చేసి, కల్వర్టుపైన ఏర్పడిన గోతిని సరిచేయాలని వారు కోరారు.

'ఐక్యత' సేవలను వినియోగించుకోవాలి

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాలులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తోందని చెప్పారు. ఈ నెల 27 వరకు నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌గౌడ్, దళపతిగౌడ్, మల్లయ్య, రమేశ్‌నాయక్, కొండల్ యాదవ్, శివ, సలీం, యూసుఫ్‌బాబా, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

చేవెళ్ల: ప్రభుత్వం కల్పిస్తున్న రైతు బీమా సౌకర్యం లేని రైతులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసి తెలిపారు. చేవెళ్లలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో రైతు బీమాకు దరఖాస్తులు చేసుకున్న రైతులు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని, కేవలం కొత్తగా భూమి పాస్‌బుక్‌లు 28 జూన్ 2024 నాటికి వచ్చిన వారు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. వీరి వివరాలు ధరణి పోర్టల్ నుంచి వ్యవసాయాధికారికి అందించినట్లు తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు ప్రకారం 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 సంవత్సరం మధ్యలో అంటే 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. రైతులు వారి వారి గ్రామాల క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈఓ)ను రైతు వేదికల వద్ద కలిసి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు గతంలో బీమాకు దరఖాస్తులు చేసుకున్న వారు నామినీలో ఏదైనా మార్పులు చేర్పులు ఉంటే కూడా ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని గుర్తించాలన్నారు. కొత్తగా రైతు బీమాకు దరఖాస్తులు చేసుకునే రైతులు రైతు బీమా దరఖాస్తు ఫారం, పట్టా పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పట్టాదారుడే స్వయంగా వచ్చి వ్యవసాధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుణమాఫీ విషయంలో ఆందోళన వద్దు

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రుణమాఫీ విషయంలో కూడా రైతులు ఆందోళన చెందొద్దని చెప్పారు. మొదటి విడతగా విడుదలైన లక్ష రూపాయల రుణమాఫీలో ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయాధికారులను కలిసి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఎవరి పేర్లు అయినా రాకపోయిన రైతులు వారి ఆధార్‌కార్డులను తీసుకొని వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లి చెబితే వారు రుణమాఫీ 2024కు సంబంధించిన సమాచారిన్నీ అందిస్తారన్నారు. సొసైటీ బ్యాంకులకు సంబంధించి ప్రతీ సొసైటీ వద్ద ఒక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని రైతులు నోడల్ అధికారిని సంప్రదించవచ్చని తెలిపారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య



నర్సింహను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: నిరుపేదల సంక్షమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన విఠ్యాల నర్సింహ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్ నర్సింహకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అందె బాబయ్య మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలన్నారు. అందరూ కలిసి కట్టుగా ముందుకుసాగి రాబోవు రోజుల్లో షాద్‌నగర్‌లో కాషాయ జెండాను ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండాలని తెలిపారు. తద్వారా పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు శంకర్ నాయక్, బొబ్బిలిగామ మల్లేష్, ఎంకనోళ్ళ శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో శ్రీ శీతల బొడ్రాయి, నాభిశిలా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఆదివారం వైభవంగా ముగిశాయి. ఉదయం బొడ్రాయికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్ర పుష్పం, హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. గ్రామంలో ఊరి మధ్యలో పూర్వం రెండు బొడ్రాయిలు అప్పటి గ్రామపెద్దలు ప్రతిష్ఠించారు. గ్రామస్తుల సహకారంతో పాత విగ్రహాలను తొలగించి కొత్త బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామస్తులందరూ బోనాలు సమర్పించారు. బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌లతో పలువురు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన అతిథులకు ఉత్సవ కమిటీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ శీతల బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ప్రధాన కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్ చాకలి యాదయ్య, కోశాధికారి ఆవుల అశోక్, గ్రామ పెద్దలు బస్వ పాపయ్య, మాజీ ఎంపీటీసీ రాములు, కుమారి రాయప్ప, మాజీ ఉపసర్పంచ్ పోతుల నర్సింగ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని

ఆదివారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో పూజలు కొనసాగాయి. ఉదయం కాగడ హారతి, బాబాకు అభిషేకం, సాయిబాబా గణపతి లక్ష్మీహోమం, సాయి వ్రతం, మధ్యాహ్న హారతి, అన్నదానం, కోలాటం, పల్లకీసేవ, ధూపహారతి, లక్షపుష్పార్చన, శేష హారతి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హారతి పూజల్లో పాల్గొన్నారు.

దీంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అల్పాహారం, అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణాలు సాయిబాబా నామస్మరణతో మార్మోగాయి. గురుపౌర్ణమి సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని ఘన్గాపూర్‌లో ఉన్న దత్తాత్రేయ స్వామిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు.



చేవెళ్ల: దత్తాత్రేయ స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల: సత్యసాయి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో పల్లకీ సేవ



నందిగామ: చేగూరులోని సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయంలో..



శంకర్‌పల్లి: సాయిబాబాకు పూజలు చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి దంపతులు



చేవెళ్ల: షిర్డీ సాయిబాబా దేవాలయంలో హారతి పూజల్లో పాల్గొన్న భక్తులు